# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ తీర్మానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసన సభలో ఈరోజు ప్రవేశపెట్టారు.**

2. **ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించడం దేశ ప్రజలకు ఊరటనిస్తుందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.**

3. **రాష్ట్రంలో విద్యుత్ శాఖ పరిధిలో అమలు అవుతున్న పనులను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.**

4. **రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

శాసన సభలో రాష్ట్ర రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ తీర్మానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రవేశపెట్టారు. ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా సమావేశమైన శాసన సభను సభాపతి సిహెచ్.అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రికి అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో రాజధాని ఎక్కడ నిర్మించాలన్న దానిపై కేంద్రం ఏర్పాటు చేసిన శివరామకృష్ణన్ కమిటీకి విజయవాడ -- గుంటూరు మధ్య ఏర్పాటు చేయాలని అధిక సంఖ్యలో వినతులు అందాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా ప్రతిపాదిస్తూ శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రతిపాదించిన తీర్మానంపై ఈరోజు చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడారు. పదేళ్ళ పాటు హైదరాబాద్ ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు అవకాశం ఉన్నా పాలన ప్రజల దగ్గర

ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కొత్త రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. శివరామకృష్ణన్ కమిటీ వేర్వేరు ప్రాంతాల్లో ప్రజల అభిప్రాయాలను సేకరించిందని పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

మిషన్ కర్మయోగి కార్యక్రమంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సాంకేతిక ఆధారిత శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించి, వాటిని పరిపాలన ఫలితాలుగా మార్చడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో నిలిచిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. వచ్చే నెల 2 నుంచి 8వ తేదీ వరకు "సాధన సప్తాహం" నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించడం, పరిపాలనా సామర్థ్యాలను మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఈ లెర్నింగ్ వీక్‌లో చురుగ్గా పాల్గొని, తమ పనితీరును మెరుగుపరచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశ ప్రజలపై పడకుండా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించడం దేశ ప్రజలకు ఊరటనిస్తుందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకున్న వేళ మోదీ ఆ ప్రభావం దేశంపై పడకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం దేశ ప్రజలతోపాటు చమురు సంస్థలకు కూడా ఊరటనిస్తుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిందని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్న వేళ ఈ నిర్ణయం సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో దాదాపు 1.55 లక్షల కోట్ల రూపాయల భారం కేంద్ర ప్రభుత్వం మీద పడుతుందని వెల్లడించారు.

---------------------------

వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం కేటాయిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అర్హులైన వారు సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సూచించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిసిన వడ్డెర సామాజిక వర్గం నాయకులు మంత్రిని నిన్న కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర వర్గాలకు మేలు జరిగేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో విద్యుత్ శాఖ పరిధిలో అమలు అవుతున్న పనులను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు, ఉన్నతాధికారులతో శ్రవణ మాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా అందిస్తున్న పీఎం సూర్యఘర్ సోలార్ కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి నాటికి ప్రతి నియోజకవర్గంలో కనీసం 2 వేల కనెక్షన్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లన్నింటినీ వచ్చే సీజన్‌కు ముందే మంజూరు చేయాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి 36 బస్సుల తనిఖీలు చేపట్టినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 236 బస్సులపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానాలు విధించినట్లు తెలిపారు. 16 ప్రాంతాల్లో ఈ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఇకపై విధిగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భద్రతా నియమాల ఉల్లంఘించిన వాహనాల యజమానులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. రవాణా శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కృష్ణాజిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకొని ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళుతున్నామని కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె బాలాజీ పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో అధికారులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఈ రోజు పాల్గొన్నారు. రహదారులు భవనాల శాఖ కార్యాలయం, ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

వాయిస్..25 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించనున్నారని అధికారులు వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ప్లీనరీ ఈ సాయంత్రం జరగనుంది. ఈ ప్లీనరీలో ముఖ్యమంత్రి పాల్గొనని ప్రసంగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-19 ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఈ రోజు రాత్రి 7 గంటల 30 నిముషాలకు జరిగే తొలి మ్యాచ్‌లో ఐపిఎల్ సీజన్ మొదలవుతుంది.

---------------------------

డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్య జయంతి ఈ రోజు. 1914 మార్చి 28వ తేదీన అనంతపురం జిల్లా చియ్యేడు గ్రామంలో ఆయన జన్మించారు. రాష్ట్రంలోని గొప్ప కవులలో ఒకరుగా పేరుపొందారు. బహుభాషావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, విశిష్ట సాహిత్య విమర్శకుడుగా ఖ్యాతి గడించారు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన విశిష్ట సేవకు జనవరి 1988లో ప్రతిష్టాత్మకమైన రాష్ట్రీయ భాషా పరిషత్ నుండి పురస్కారాన్ని అందుకున్నారు.

గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పుట్టపర్తి నారాయణాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

======================